

# సుబ్బారావు పెళ్లి

గంటి శ్రీరామ ప్రకాష్

**'నీ స్టాప్ వచ్చింది, దిగు! అరె...జల్దీ దిగవయ్యా!' అన్న కండక్టర్ మాటలతో బస్సు నుండి కిందకు దిగాను.**

ఆ ప్రాంతం సిటీలోనిదే. అయితే దూరంగా ఉండడంవల్ల జనసమ్మర్దం చాలా తక్కువగా ఉంది. చుట్టూ కొండలు. అసలు సరైన చోటనే దిగానా, లేదా అని అనుమానం. ఆలోచించనివ్వకుండా కంగారుగా సిటీబస్సు నుండి దింపేసిన కండక్టర్ మీద కోపం వచ్చింది. తప్పదన్నట్లు నడక మొదలు పెట్టాను.

అప్పుడే నాలుగేళ్లయింది సుబ్బారావుని చూసి. నిరాడంబరత్వానికి ఉదాహరణగా ఉండేవాడు. క్రమశిక్షణ విషయంలో అప్పుడతడే నాకు మార్గదర్శి. నాకు బాగా జ్ఞాపకం - టెన్త్ వరకు తెలుగులో చదివిన నేను ఇంటర్‌ను ఇంగ్లీషులో చదవడానికి భయపడితే తిట్టి ధైర్యం చెప్పాడు.

ఉదయాన్నే లేచి సంధ్యావందనం చేసేవాడు. నాకూ పెద్దవాళ్లు ఒడుగెప్పుడు చేస్తారా, నేనెప్పుడు సుబ్బారావుని అవుతానా అని ఎదురు చూసేవాడిని. అతనితో కలిసే సినిమాలు చూడటం వల్ల అతని అభిమాన హీరోకే నేనూ అభిమానినయ్యాను.

చదువు విషయంలో కూడా అతనిని అనుకరించేవాడిని. చదువు అయిన వెంటనే సిటీలో ఉద్యోగం రావడంవల్ల అతనప్పుడు ఇక్కడికి వచ్చేశాడు. ఇక అప్పటినుండి కలవడం కుదరలేదు.

'సుబ్బారావుపెళ్లి' అనేసరికి దూరం అయినప్పటికీ రాకుండా ఉండలేకపోయాను. పెళ్లి కొడుకుగా సుబ్బారావెలా ఉంటాడన్న విషయమే నన్ను ఇక్కడికి రప్పించింది.

కొండరాళ్లమధ్య కాలనీలో షామియానా ఇల్లు కనబడటంతో అది నా జ్ఞాపకాలను ఆపు చేసినప్పటికీ, పెళ్లివారింటిని తెలుసుకొనగలిగినందుకు 'హమ్మయ్య' అని ఊపిరిపీల్చు కున్నాను. అయినా పెళ్లి ఆడపెళ్లి వారింట్లో జరగడం మన సంప్రదాయం కదా! మరి సుబ్బారావింట్లోనే వాడి పెళ్లి చేస్తున్నారేమిటి? ఆ ఖర్చును కూడా భరిస్తున్న సుబ్బారావు కుటుంబాన్ని మనసులో అభినందించ కుండా ఉండలేకపోయాను.

'షామియానా ఇల్లు' రానే వచ్చింది. సుముహూర్తానికి ఇంకా చాలాసమయం ఉండటంతో అనుకుంటూ హడావుడి సాధారణస్థాయిలోనే ఉంది. వీటన్నిటినీ నా మనసు ఆలోచిస్తూ కళ్లు మాత్రం సుబ్బారావుని వెదకడం వల్లనేమో, నలుగురు పెద్దల సమక్షంలో కూర్చుని ఉన్న సుబ్బారావుని కొద్ది సేపటికి కానీ గుర్తించలేకపోయాను.

"హల్లో! వాట్ ఎ సర్‌ప్రైజ్! ఇప్పుడేనా రావడం? అది సరే కానీ, ఏంమిటి ఒక్కడివే వచ్చావ్? మీ వాళ్లెవరూ రాలేదా?"

నేను సమాధానం ఇచ్చేలోపుగానే, "పోనీలే, అంత దూరంనుండి నువ్వొచ్చావ్, సంతోషం! ఏమిటి ఎలా ఉంది మీ ఊరు? ఏం చేస్తున్నావిప్పుడు?"

"ఏముంది అంతా బాగానే ఉన్నాం. ఇంతకీ పిన్నిగారు, బాబాయిగారు కనబడరే?"

"ఎవరూ ... ఓహో! మా అమ్మా, డాడీనా! అదుగో, దూరంగా ఎడమచేతిపక్క మరో ఇల్లు లేదూ, అక్కడ డాడీ ఉన్నారు. ఇక ఎదురుగా ఉన్న పెళ్లి మండపానికి అమ్మ డెకరేషన్ చేయిస్తోంది."

"సరే, ఇంకా పెళ్లి ముహూర్తానికి రెండుగంటలే టైముంది కదా! వచ్చేవారిని పలకరించడం, పంచె కట్టుకోవడం, చాలా పనులుంటాయి. మళ్లీ కలుస్తానులే, ఈలోపు మీ కాలనీని పలకరించి వస్తాను!"

"ఆ తలనొప్పి కొంతసేపటికి తర్వాత ఎలాగూ తప్పదు. ఇప్పటినుండీ ఎందుకు? అయినా నీకు మా కాలనీ అంత బాగా నచ్చినే వెళ్లి చూసిరా!"

సుబ్బారావు దగ్గరనుండి లేచి బయటకు వచ్చాను. అక్కడ ఇంకేం ఉన్నాయో చూద్దామని నల్లని తారురోడ్డును అనుసరిస్తూ ముందుకు సాగాను.

చీకటి పడుతూండడంతో వీధి లైట్లు వెలగడం మొదలుపెట్టాయి. ఆ కాంతి అంతా నా కోసమే ఉన్నదన్నట్లుగా నేను తప్ప ఆ రోడ్డు మీద ఎవరూ తిరగడంలేదు.

## ఫ్రిజ్ ఉందిగా...

**రాణి:** (పక్కింటావిడతో) వారంకిందట కూరగాయలకెళ్లిన మావారు ఇప్పటివరకు రాలేదు, పిన్నిగారూ!

పక్కింటావిడ: మరేం పర్లేదులేమ్మా...మా ఫ్రిజ్‌నిండా కూరగాయలున్నాయ్...తీసుకెళ్లు.

**- చందూ వంశీ**, నంద్యాల

సుబ్బారావు ఊరికింత దూరంగా ఇల్లు కట్టాడేమిటి? వచ్చిన వారిని భయపెట్టి చంపడానికి కాకపోతే! అయినా సిటీలో రోజుకి వేలకొద్దీ వచ్చి స్థిరపడుతున్న వారందరికీ ఊరి మధ్యలో ఇల్లు దొరకాలంటే ఎలా సాధ్యం? పైగా అక్కడ ఇల్లు కట్టాలంటే మాటలా?

తెలివైనవాడు కాబట్టే ఊరికి దూరం అయినా చీప్‌గా స్థలం కొని ఇక్కడిల్లు కట్టాడు. ఇలా పుట్టిన కాలనీలే సిటీ పొలిమేరల్ని పెంచుకుంటూ పోతున్నాయి.

కడుపు కరకర కాలుతుండడంతో తిరిగి పెళ్లి పందిరికేసి నడవడం మొదలుపెట్టాను.

'అరే! అరగంటలోనే అక్కడంతా కార్లతోనూ, బళ్లతోనూ నిండిపోయిందే! ఇంతవరకూ పలచగా ఉన్న పెళ్లిపందిరి ఎంత హడావుడిగా మారిపోయింది?'

పెళ్లిపందిరికి ఇవతల బల్లమీద గులాబీ పూలను వచ్చినవారికి అందించి, పన్నీరు జల్లుతున్నారు నలుగురమ్మాయిలు. సుబ్బారావు పెళ్లేదో వారికి పెళ్లిచూపులయినట్లు చూపులు విసురుతున్నారు.

నాకు వారిచ్చిన పువ్వును ఏం చేసుకోవాలో అర్థం కావడంలేదు. దంపతులను కంగ్రాట్ చేస్తూ ఇద్దామనుకుంటే జనాలను దాటుకుని మండపం దగ్గరకి వెళ్లేటప్పటికి ఆ పువ్వు కాస్తా రేకులవుతుంది. పోనీ అక్కడివారిలా చొక్కాకి పెట్టుకుందామంటే నాది కాస్తా నెహ్రూగారి కోటులాంటిది కాదాయె!

ఎందుకొచ్చిన గొడవనుకుని తిరిగి ఆ టేబుల్ మీదే పువ్వును పెట్టేశాను. అది చూసిన ఆ నలుగురిలో ఒకమ్మాయి నవ్వుతూ పక్కమ్మాయి చెవిలో ఏదో ఊదేస్తోంది. అక్కడుంటే ఎందుకొచ్చిన డేంజర్ అని వెంటనే జనావళిని తప్పించుకుని పెళ్లి మండపానికి చేరుకున్నాను.

అప్పుడే సుబ్బారావు, పెళ్లికూతురు పెళ్లిపీటల మీద ఎదురెదురుగా కూర్చుని ఉన్నారు.

ఒకరినొకరు చూడడంలో ఆసక్తిని రేకెత్తిస్తున్నట్టుగా మధ్యలో గుడ్డను పట్టుకున్నారు పెద్దాళ్లు. ఆ గుడ్డమీద ఏవో అక్షరాలు మెరవడం నాలో ఈసారి ఆసక్తి కలిగించింది. ఏమిటా నని చూస్తే 'చూపులుకలిసినశుభవేళ' అని రాసి ఉంది. ఇది సిటీ కళాత్మకత గా మోసున నుకున్నాను.

సడన్‌గా ఏమైందో ఏమో బాండ్‌ట్రూప్‌వారు హోరెత్తించడం మొదలుపెట్టారు. పెళ్లికొడుకు, పెళ్లికూతురు జీలకర్ర బెల్లం ముద్దను ఒకరి తలపై మరొకరు పెట్టడం వల్లనేమో వారిలో అంత చలనం వచ్చింది.

తీసే ఫొటోలకోసం, వీడియో కోసమనుకుంటా చేతులు నొప్పి పుట్టేవరకూ కూడా వారలానే ఉండిపోయారు.

ఎక్కడున్నవారు అక్కడ నుండే అక్షింతలు విసరడం మొదలు పెట్టారు.

మధ్యలో ఉన్న నేను ఐదునిమిషాలు దులుపుకుంటే కానీ అక్షింతలు నా తలలోంచి బయటకు రాలేదు.

గురువుగారు మంత్రాలు ఆపారు. ఒక్కొక్కరే వెళ్లి దంపతులను కలిసి వారి చేతిలోని గిఫ్టులనిస్తున్నారు. గిఫ్టు సైజునిబట్టి వీడియో తీసే సమయమూ, ఫొటోలూనూ! పెళ్లికి అలంకారప్రాయమైన మంగళసూత్రధారణ, తలంబ్రాలు ఇప్పుడిప్పుడే అయ్యేటట్లు కనబడడంలేదు.

పెళ్లికొచ్చిన వారందరూ ఒక్కసారిగా లేచి బయలుదేరారు. వారు భోజనానికి వెడుతున్నట్లు తెలిసింది. ఆత్మారాముడు గొడవ చేస్తూండడంతో నేనూ వారిని అనుసరించాను. అందరూ ఒకేసారి భోజనానికి లేవడంతో అక్కడ ఖాళీ ఉండదేమో అన్న నా అనుమానాన్ని సుబ్బారావు దగ్గరి బంధువు దగ్గర వెల్లడించాను.

'అరె! మీరలా అనుకోనక్కరలేదు. అక్కడ బోలెడంత జాగా! చక్కగా వెళ్లిభోజనం చేసి రండి!' అన్నాడాయన.

అయినా ఇంతమందికి భోజనం ఏర్పాటు ఒకేసారి ఎలా కుదురుతుందబ్బా? అనే అనుమానంతో అక్కడికి వెళ్లాను.

స్పీకర్ నుండి సినిమా పాటలు హోరెత్తిస్తున్నాయి. లైట్లు విరగపడి వెలుగుతున్నాయి. కానీ అన్ని పదార్థాలు పేర్చిన అరడజను బల్లలు మాత్రం అక్కడ ఉన్నాయి. వచ్చినవారంతా ప్లేటును తీసుకుని వారిక్కావలసిన పదార్థాలు వేసుకుంటున్నారు.

అదే లైనులో నేను నించుందామని అనుకునేంతలో జనంలో ఎవరో తోసిన తోపుకి లైను చివరికి వెళ్లాను. చివరికి మొదటిరోజు సినిమాటిక్కెట్టు సంపాదించినట్టుగా ఒక ప్లేటుపదార్థాల్ని సాధించాను.

ఆ తోపులాటలో ప్లేటును కాస్తా ఎవరికైనా తగిలిస్తామోనని భయంతో ఖాళీప్రదేశం కోసం చూడసాగాను. కానీ నేను ఎడారిలో ఒయాసిస్సు కోసం చూస్తున్నానని కాసేపటికి కానీ తెలియలేదు. అంతలోనే ఒకరు చెట్నీనీ, సాంబారుని నా చొక్కాకు అంటించడం, ఒక 'సారీ!' నా దగ్గర ఉంచి వెళ్లిపోవడం జరిగిపోయింది.

మరొకపక్కనుండి సినిమా పాటల హోరు, జనాలజోరు పోటీ పడుతోంది. ప్లేటు ఖాళీ కావడంతో జనాలతో పెనుగులాడి మరికొన్ని పదార్థాలు వేయించుకోగలిగాను.

మైకులో నుండి 'ముస్తఫా! ముస్తఫా!'నని ఎవరో పిలుస్తున్నట్లనిపించి ఉలిక్కిపడ్డాను. సరిగ్గా ఆ పాట విన్న తర్వాత అలా ధ్వనించిన పాట అలా లేదని తెలిసి ఊపిరి పీల్చుకున్నాను. ఎలాగైతేనేం భోజనం అయింది.

భోజనం కోసం అప్పుడే అక్కడకు వస్తున్న వారిమీద జాలి వేసింది, వారూ నా పరిస్థితినే ఎదుర్కోబోతున్నందుకు.

ఆ రాత్రే తిరిగి వెళ్లాల్సిన నేను బస్సు దొరుకుతుందా, లేదానన్న భయంతో సుబ్బారావుకి మరొకసారి కనబడి వెళ్దామన్న ఉద్దేశంతో తిరిగి మండపానికి చేరుకున్నాను.

అక్కడ సుబ్బారావు, పెళ్లికూతురు, వారి పెద్దలు, బ్రహ్మగారు, వీడియోగ్రాఫర్ మాత్రం మిగిలారు.

సుబ్బారావుతో "ఇక వెళ్తాను, ఆల్ ది బెస్ట్!" అన్నాను.

"ఇంతకీ భోజనాలెలా ఉన్నాయి?" అని ప్రశ్నించారు సుబ్బారావు తండ్రి.

"అమోఘంగా ఉన్నాయిండీ!" అని లాఘవంగా అబద్ధం ఆడాను.

"అంతదూరం నుండి పెళ్లికి వచ్చినందుకు చాలా ఆనందిస్తున్నానోయ్! మన ఊరిలో అందరికీ పెళ్లివిశేషాలు చెప్పు, జాగ్రత్తగా వెళ్లిరా!" అన్నారాయన.

సిటీబస్సు ఎదురుచూపులో రోడ్డును చేరుకున్నాను. పెళ్లిఖర్చు తామే భరించి ఆ ఖర్చుకు రెట్టింపును కట్నంలోనే కలిపి వసూలు చేసిన సుబ్బారావు ఇంటివారి తెలివితేటలకు మరొక్కసారి ఆశ్చర్యపడ్డాను. అంత చీకటిలో, చలిలో ఒంటరిగా బస్సుకోసం ఎదురు చూస్తున్న నాకు ఒక్క విషయానికి మాత్రం ఆనందం కలుగుతోంది - 'బస్సు వచ్చేంత వరకూనయినా తారురోడ్డు నాకు తోడుగా నిల్చుని ఉన్నందుకు!'